చెస్ పోటీల విజేతకు సన్మానం



విశిష్టను అభినందిస్తున్న అనంత కృష్ణ

జియాగూడ: ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర అండర్–7 గర్ల్స్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో కార్వాన్ నియోజకవర్గానికి చెందిన జె.విశిష్ట ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో బీజేవైఎం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పడాల అనంత్‌కృష్ణ నాయకులతో కలిసి విశిష్టను బుధవారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు శ్రావణ్, డి.శ్రీకాంత్, నితీశ్ రెడ్డి, ఉదయ్‌గౌడ్, సంతోష్, అరుణ్ యాదవ్ పాల్గొన్నారు.

టోలిచౌకీ బీజేపీ అధ్యక్షుడిగా శ్రీకాంత్



గోల్కొండ: టోలిచౌకీ బీజేపీ డివిజన్ అధ్యక్షుడిగా బొమ్మల శ్రీకాంత్ రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమామహేందర్ చేతుల మీదుగా బుధవారం నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సునీతరావును సత్కరించిన బజ్జుగోప్ యాదవ్

అబిడ్స్: బేగంబజార్ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బజ్జుగోప్ యాదవ్ కోరారు. ఈమేరకు నాయకులతో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతరావును బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. దీంతో ఆమె స్పందిస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నిక



గుండ్రెడ్డి రమాదేవి

అబిడ్స్: రాష్ట్ర మేధావుల ఫోరం ఉపాధ్యక్షురాలిగా జాతీయ బీసీ మహిళా సంక్షేమ కన్వీనర్ గుండ్రెడ్డి రమాదేవిని బుధవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. రమాదేవి 25 ఏళ్లుగా బీసీ సంక్షేమ సంఘం ఉద్యమకారురాలిగా కొనసాగుతున్నారని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పేద, బడుగు వర్గాలకు మరిన్ని సేవలందిస్తానని పేర్కొన్నారు. తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు, ఇతర కార్యవర్గ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

చార్మినార్: పాతబస్తీలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సమీర్ వలియుల్లా అన్నారు. జిల్లా పరిశీలకుడు సురేశ్ కుమార్ సుబ్రహ్మణ్య ప్రసాద్తో కలిసి మూసా పగిలిలోని చార్మినార్ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ నాయకులతో పాటు కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మహమ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్, సీనియర్ నాయకులు మూసా ఖాసిం, కె వెంకటేశ్, హైదర్ జాఫరీ, అస్కర్ అలీ బేగ్, సురేశ్, చంద్రశేఖర్, పురుషోత్తం, అస్లాం ఉల్లా షరీఫ్, వరుణ్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



డబీర్‌పురా: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జాఫర్ రోడ్డు ఐసీఐసీఐ బ్యాంక్ ఏటీఎం సమీపంలో 55–60 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని పెట్రోలింగ్ పోలీసులు బుధవారం గుర్తించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు మరో చాన్స్!

సద్వినియోగం చేసుకోవాలి: డీసీలు



సమావేశంలో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య

బంజారాహిల్స్: అనధికార స్థలాలు, వెంచర్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్)కు ఈ నెలాఖరు వరకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాంకేతిక కారణాలు, ఆర్థిక భారంతో ముందుకురాని వారికి గడువు పెంపు మంచి అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య, ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డిలు సూచించారు.

- జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధి కిందికి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్లు వస్తాయి. వీటి పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌కు 121 దరఖాస్తులు అర్హత కలిగినవిగా గుర్తించారు. వీరందరికీ ఫీజులు చెల్లించాలంటూ నోటీసులు కూడా జారీ చేశారు. సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు రూ.2.66 కోట్లు వసూలైంది. మిగతా వారు కూడా ఈ నెలాఖరు లోగా తమ ఫీజులు చెల్లించుకోవాలని అధికారులు సూచించడమే కాకుండా దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు.
- ఖైరతాబాద్ సర్కిల్–17 కిందికి సోమాజీగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లు వస్తాయి. ఎల్‌ఆర్‌ఎస్ కోసం సర్కిల్ పరిధిలో 1600 దరఖాస్తులు రాగా 160 దరఖాస్తులు మాత్రమే అర్హతకు నోచుకున్నాయి. వీరందరికీ ఎంత ఫీజు చెల్లించాలో నోటీసులు కూడా జారీ చేశారు. ఇప్పటివరకు 33 దరఖాస్తుదారులు మాత్రమే తమ ఫీజులను చెల్లించారు.

మూడోసారి పెంపు..

గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ 2020 పేరిట క్రమబద్ధీకరణ పథకాన్ని తీసుకువచ్చింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం 25 శాతం రాయితీతో గత ఫిబ్రవరిలో వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని ప్రకటించింది. మార్చి 31వ తేదీతో గడువు ముగిసింది. ప్రజలు విజ్ఞప్తి చేయడంతో ఏప్రిల్ 30 వరకు ఈ పథకాన్ని పొడిగించారు. ఆ తర్వాత మే నెల 3వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. తాజాగా ఈ నెల 31 వరకు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ సర్కిళ్ల పరిధిలో స్థలాలు, వెంచర్ల క్రమబద్ధీకరణకు పెద్ద ఎత్తున అర్జీలు అందగా పరిపాలన కేంద్రం నుంచి అందిన వివరాలను అనుసరించి రుసుము చెల్లింపునకు అర్హత గల దరఖాస్తులను గుర్తించి సంబంధీకులకు పంపించారు.

మార్పులు చేర్పులతో..

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ వేగవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకువెళ్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి వీరికి సంబంధిత పత్రాలు అందజేయాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్తున్నారో లేదో కూడా తెలియకుండా ఉంది. ఫలితంగా ఇంకా చాలామంది దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. వేగం కనిపించకపోవడంతో చాలా మంది వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. రుసుం చెల్లింపు పూర్తయిన స్థలాలను పరిశీలించడానికి సరిపడా సిబ్బంది లేకపోవడం ఓ సమస్యగా మారింది. ఇంకోవైపు ఉన్న సిబ్బంది ఇతరత్రా పనులతో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ ఎంతవరకు ముందుకు సాగుతుందో వేచిచూడాల్సి ఉంది.

విద్యాశాఖ ఉద్యోగులకు అండగా టీఎన్జీవోస్ యూనియన్



పదోన్నతి పొందిన ఉద్యోగులను సత్కరిస్తున్న కేఆర్ రాజ్‌కుమార్, భాస్కర్ తదితరులు

అబిడ్స్: విద్యాశాఖ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బందికి టీఎన్జీవోస్ యూనియన్, హైదరాబాద్ విద్యాశాఖ అసోసియేషన్లు నిరంతరం అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని హైదరాబాద్ జిల్లా టీఎన్జీవోస్ అసోసియేట్ ప్రెసిడెంట్, విద్యాశాఖ నగర టీఎన్జీవో అధ్యక్షుడు కె.ఆర్ రాజ్ కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ విభాగంలో పలువురు ఉద్యోగులకు విద్యాశాఖ ఆర్జేడీ విజయలక్ష్మి పదోన్నతులు కల్పించారు. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన ఖాజా మొయిద్దీన్, శాస్త్రిలను బుధవారం ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ పరిధిలోని హైదరాబాద్ జిల్లాలో ఉద్యోగులు, సిబ్బందికి తమ విద్యాశాఖ యూనియన్ అండగా ఉండి అన్ని విధాలుగా సేవలందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి భాస్కర్, కోశాధికారి ప్రేమ్ కుమార్, ఇతర నాయకులు జయంతి రెడ్డి, ఎంజీ రవి, ఫిరోజ్ అహ్మద్, ప్రియదేవ్ ఠాకూర్, ముజాహిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మిస్ ఇండియాలో ఆకట్టుకున్న పేరిణి నృత్యం

గన్‌ఫౌండ్రీ: మిస్ ఇండియాలో పేరిణి నృత్యంతో ప్రీతి ఆకట్టుకుంది. భర్త సహకారంతో ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల, గుడిమల్కాపూర్ హైదరాబాద్‌లో ప్రవేశం పొంది పేరిణి నృత్య కళారూపాన్ని ఎంచుకొని గురువులు సెంట్రల్ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ప్రకాశ్, తెలంగాణ రాష్ట్ర మహిళా పురస్కార అవార్డు గ్రహీత సునీలా ప్రకాశ్ శిష్యరికంలో సాధన చేస్తూ అనేక ప్రదర్శనలు చేశారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ ప్రోత్సాహంతో మిస్ వరల్డ్ 2025 ప్రారంభ ఉత్సవంలో పాల్గొనే అత్యంత అరుదైన అవకాశాన్ని పొందారు.

కల్తీ మద్యం పట్టివేత

ఇద్దరి అరెస్ట్, కారు సీజ్

రాజేంద్రనగర్: ఢిల్లీ మద్యం బాటిళ్లలో కల్తీ మద్యం నింపి తక్కువ ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ముఠాను శంషాబాద్ డీటీఎఫ్, ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. రాజేంద్రనగర్‌లోని కాటేదాన్ ప్రాంతంలో జరుగుతున్న ఓ ఫంక్షన్ హాల్‌కు మద్యం దుకాణాల్లో లభించే ధరల కంటే దాదాపు రూ.500 నుంచి 1,000ల వరకు తక్కువకు మద్యాన్ని సరఫరా చేస్తామని ఓ ముఠా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు కారులో 4 కార్టన్లలో మద్యం సీసాలు తరలిస్తుండగా శంషాబాద్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కలిసి దాడి చేసి ఇద్దరి నిందితులను పట్టుకుని వారి నుంచి ఢిల్లీకి చెందిన 72 బ్లాక్ లేబుల్ మద్యం బాటిళ్లు (54 లీటర్లు), కారు స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు. బ్లాక్ లేబుల్ మద్యాన్ని పరిశీలించగా అది ప్యూరియస్ లిక్కర్‌గా ఉందని గుర్తించారు. మద్యం, కారు విలువ రూ.20 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. ఇలాంటి మద్యాన్ని కొనుగోలు చేసి కేసుల పాలు కావద్దని శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ పేర్కొన్నారు. డీటీఎఫ్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై జి.శ్రీకాంత్ రెడ్డి, సిబ్బంది ఫారూఖీ ద్దీన్, గణేశ్, నెహ్రూ, సాయి శంకర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ అభినందించారు.

మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం

గోల్కొండ: గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ నిర్వహణ అధ్వానంగా తయారైందని, దీనికి మార్కెట్ కమిటీ కార్యదర్శి బాధ్యుడని తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి.జీవన్‌సింగ్ కోరారు. ఈమేరకు ఆయన ఆధ్వర్యంలో నాయకులు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. చిల్లర కూరగాయల వ్యాపారుల కోసం ప్రత్యేకంగా షెడ్లు కేటాయించారని అయితే వీరు హోల్‌సేల్ వ్యాపారుల చేతుల్లో నలిగిపోతున్నారన్నారు. అలాగే మార్కెట్‌లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించిందని పేర్కొన్నారు. హోల్‌సేల్ వ్యాపారులతో పాటు వారికి సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమ్మెలో బహుజన కార్మికవర్గం పాల్గొనాలి



సదస్సులో మాట్లాడుతున్న దండి వెంకట్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే సమ్మెలో బహుజన కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ పిలుపునిచ్చారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో బహుజన వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా దండి వెంకట్ మాట్లాడుతూ... రాజ్యాంగం కల్పించిన 44 రక్షణ చట్టాలను కేంద్రం రద్దు చేసి కార్మిక వ్యతిరేక కోడ్‌లను కార్పొరేట్ సంస్థల లాభాల కోసమే తీసుకొస్తోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి కనీస వేతనం రూ.26వేలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ట్రేడ్ యూనియన్ నాయకులు అనిల్‌కుమార్, కె. చంద్రశేఖర్, సిద్ధిరాములు, ప్రసాద్, రాజేష్, మల్లేష్, యాకయ్య, కలీల్, యాదగిరి, జంగయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గడువు తీరిన చైల్డ్ కిట్‌పై అధికారుల విచారణ

గోల్కొండ: గోల్కొండ ఏరియాసుపత్రిలో గడువు తీరిన చైల్డ్ కిట్ నవజాత శిశువుకు ఇవ్వడంపై ఆరోగ్య శాఖ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. ఆరోగ్య శాఖ కమిషనర్ అజయ్‌కుమార్, పీసీహెచ్‌వో డాక్టర్ రాజేందర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాస్‌రావుతో ఆరా తీశారు. కిట్‌లోని 3 వస్తువుల్లో ఒక్కదాని గడువు తీరిందని పొరపాటున అది నవజాత శిశువు తల్లి ముస్కాన్ బేగంకు ఇచ్చామని వివరించారు. కాగా మళ్లీ పునరావృత్తం కాకుండా చూడాలని కమిషనర్ అజయ్‌కుమార్ హెచ్చరించారు. నవజాత శిశువు తండ్రి రాహుల్ శర్మకు కొత్త కిట్ ఇవఅందించాలని సూచించారు.

అండర్–14 క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని ఆధ్వర్యంలో నీవీ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో గాంధీనగర్ డివిజన్‌లో ఈనెల 16, 17వ తేదీలలో అండర్ 14 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. దీనికి సబంధించిన పోస్టర్‌ను బుధవారం గాంధీనగర్ కార్పొరేటర్ కార్యాలయంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ ఆవిష్కరించి మాట్లాడారు. శుక్రవారం, శనివారం రెండు రోజులు స్థానిక శ్రీనివాసా గ్రౌండ్స్‌లో క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు తమ ఆధార్‌కార్డు జిరాక్స్‌తో నిర్వాహకులను సంప్రదించాలని కోరారు. వివరాలకు ఫోన్ నం. 917730 2777, 7799 65788లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, పి.నర్సింగ్‌రావు, సత్తిరెడ్డి, శివకుమార్, సాయికుమార్, ఆనంద్‌రావు, సత్యేందర్, రాహుల్, సాయి తేజ, నీరజ్, కృష్ణవేణి పాల్గొన్నారు.

వలస కార్మికులకు అండగా మజ్లిస్

గోల్కొండ: వలస కార్మికులకు మజ్లిస్ అండగా ఉంటుందని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. బీహార్‌లోని కిషన్‌గంజ్ జిల్లాకు చెందిన ఖరీం అనే వలస కార్మికుడు అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా నిరుపేద కుటుంబం కావడంతో అతడి అంత్యక్రియలు స్వగ్రామంలో జరిపిస్తామని మృతుడి బంధువులు మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీని కలిసి విన్నవించారు. దీంతో ఆయన సూచన మేరకు ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్‌హుస్సేన్ మృతదేహాన్ని స్వస్థలానికి పంపేందుకు అంబులెన్స్ ఏర్పాటు చేశారు. ఇదిలాఉంటే చికిత్స సమయంలో తోటి కూలీలు అండగా ఉండి మానవత్వం చాటారని ఆయన పేర్కొన్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆపరేషన్ సిందూర్‌లో మృతి చెందిన ఆర్మీ జవాన్‌లకు, భారత పౌరుల ఆత్మకు శాంతి చేకూరాలని సామాజిక తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో కేండిల్ ర్యాలీ నిర్వహించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జరిగిన ర్యాలీలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అమానగంటి సైదులు, సీహెచ్ రాజకుమార్‌గౌడ్, ఎం.సతీష్ యాదవ్, ప్రఫుల్ రామ్‌రెడ్డి, మాచర్ల వెంకటస్వామి, లావణ్య, చంద్రన్న, మెట్టు ధన్‌రాజ్, యాదగిరి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార కేంద్రాల్లో రోడ్లను విస్తరించండి



మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్: వ్యాపార కేంద్రాలైన సిద్ధిఅంబర్‌బజార్, ఫీల్‌ఖానా, బేగంబజార్, ఛత్రి, ఎంజే బ్రిడ్జి, గోషామహల్, ఉస్మాన్‌గంజ్ తదితర వ్యాపార ప్రాంతాల్లో రోడ్లను విస్తరించాలని రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కోరారు. ఈమేరకు నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం కాలం నాటి ఇరుకైన రోడ్లు ఉన్నాయని, మరోవైపు గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆసుపత్రి నిర్మించనున్నారని దీంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతుందన్నారు. ప్రజలు, వ్యాపారుల సమస్యలను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

గోల్కొండ ఇక నుంచి టోలిచౌకీ డివిజన్

గోల్కొండ: గోల్కొండ డివిజన్‌ను ఇక నుంచి టోలిచౌకీ డివిజన్‌గా పిలవాలని టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు, పరిధి పునర్విభజన తదితర విషయాలను బుధవారం ఆయన వెల్లడించారు. పాత హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీలు టోలిచౌకీ స్టేషన్ పరిధిలోకి మార్చామన్నారు. అలాగే ఫిల్మ్‌నగర్ స్టేషన్ పరిధిలోని జానకీనగర్, సూర్యనగర్, బృందావన్ కాలనీ, అజీజ్‌బాగ్, సమత, పారమౌంట్ కాలనీ, న్యూ సమత కాలనీలే టోలిచౌకీ పరిధిలో కలిపామని తెలిపారు. అదేవిధంగా జమాలికుంట, రాఘవకాలనీ తదితర ప్రాంతాలను గోల్కొండ స్టేషన్ పరిధిలోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటైన టోలిచౌకీ పోలీస్‌స్టేషన్‌ను అజీజ్‌బాగ్ కాలనీలో ఏర్పాటు చేశామని త్వరలోనే దీనిని అధికారికంగా ప్రారంభిస్తామని తెలిపారు.

‘కురుమ సంఘంపై అసత్య ఆరోపణలు తగవు’



మాట్లాడుతున్న సంఘం నాయకులు

అఫ్జల్‌గంజ్: కుల సంఘానికి సేవ చేయని కొందరు వ్యక్తులు కురుమ సంఘంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని వారిపై చట్టపరమైన తీసుకుంటామని ఆ సంఘం మీడియా కమిటీ చైర్మన్ చీర శ్రీకాంత్ పేర్కొన్నారు. ముస్లింజంగ్‌పూల్ వంతెన వద్ద సంఘం నాయకులు కె.నర్సింహ, రాఘవేందర్, ఎక్కాల కన్నా, కట్టా మల్లేశం, తూంకుంట అరుణ్ కుమార్, టి.బాలమణి తదితరులు బుధవారం మాట్లాడారు. ఓ వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో సంఘం పెద్దలను లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. సంఘం సభ్యత్వ నమోదు పూర్తయిన తర్వాత ఓటింగ్ పద్ధతిలో సంఘం ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జంటనగరాల నాయకులు, మహిళా సంఘం అధ్యక్షురాలు మిర్యాల విజయలక్ష్మి, శ్యామల, సునీత, ఎం.విజయలక్ష్మి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

పీస్ కమిటీలను మరింత విస్తృతం చేస్తాం



మాట్లాడుతున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: పీస్ కమిటీలను మరింత విస్తృత పరిచి బలోపేతం చేస్తామని టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ లాంటి సున్నితమైన ప్రాంతంలో పీస్ కమిటీలు సమర్థవంతంగా పని చేస్తున్నాయన్నారు. కొత్తగా పోలీస్‌స్టేషన్లు ఏర్పడడం, కొన్ని స్టేషన్ల పరిధిలు మారడం వల్ల గోల్కొండ పీస్ కమిటీ సభ్యుల సంఖ్య తగ్గిందన్నారు. నూతన సభ్యులను తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పీస్ కమిటీకి ఎన్నికలు నిర్వహించి నూతన బాడీని ఎన్నుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, డీఐ రాజేంద్రప్రసాద్, పీస్ కమిటీ సభ్యులు మిర్జా ఎక్బాల్ అహ్మద్, పరమానందం, నర్సింగ్‌రావు, ఆబిద్, ఇలియాస్ అలీ, షకీల్ ఆలీఖాన్ తదితరులు ఉన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే ‘బస్తీ బాట’



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సమస్యలు తెలుసుకునేందుకే ‘బస్తీ బాట’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. నానల్‌నగర్, లంగర్‌హౌస్, గోల్కొండ తదితర డివిజన్లలోని బస్తీల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు వినతి పత్రాలు అందజేశారు. ఆయన స్పందిస్తూ ప్రతి నెల జలమండలి, బల్దియా, విద్యుత్ శాఖల అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్ ఫరాన్, మోసీన్ బాకుల్కా తదితరులు ఉన్నారు.

ఇంజినీరింగ్ కోర్సుల ఫీజులు పెంచొద్దని వినతి



ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నాంపల్లి: ఇంజినీరింగ్ కాలేజీల్లో కోర్సుల ఫీజులు పెంచి విద్యార్థులపై భారం మోపవద్దని, అలాగే అధ్యాపకులకు వేతనాలు ఇవ్వకుండా మోసం చేస్తున్న ప్రైవేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్, స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంకు టీపీటీఎల్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విజయ్‌కుమార్, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం బుధవారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నత విద్యా మండలి చొరవ చూపి ఫీజుల పెంపును ఆపాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరిస్తే పోరాటాలు చేస్తాం



మాట్లాతున్న గోవర్ధన్

సైదాబాద్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించాలని ప్రయత్నిస్తే అన్ని కార్మిక సంఘాలతో కలిసి పోరాటాలు చేస్తామని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీజీయూఈఈయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.గోవర్ధన్ అన్నారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆస్మాన్‌గఢ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ జెండా దిమ్మె, శిలాఫలకాన్ని ఆయన రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి నలువాల స్వామితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సబ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన యూనియన్ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో విద్యుత్ కార్మికులు అందరూ పాల్గొనాలని కోరారు. ఈశ్వర్‌రావు, నలువాల స్వామి మాట్లాడుతూ.. విద్యుత్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కుమార్ చారి, సురేష్‌గౌడ్, శ్రీధర్,రాము పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

శంషాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు మృతిచెందిన ఘటన కొత్వాల్‌గూడలో జరిగింది. కొత్వాల్‌గూడ అంజయ్య, సరిత దంపతుల కుమారుడు అజయ్ (13) స్నేహితులతో కలిసి 10 రోజుల క్రితం బైక్‌పై శంషాబాద్ వైపు వెళ్తుండగా పంచవటి పార్కుకు దగ్గరలో వాహనం స్కిడ్ అయి కిందపడిపోయారు. అజయ్ తీవ్రంగా గాయపడగా, మిగితవారు స్వల్పంగా గాయపడ్డారు. దీంతో అజయ్‌ని ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. స్థానిక ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గంధం రవీందర్‌ముదిరాజ్, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ నాయకుడు పూర్ణచందర్ ముదిరాజ్ రూ. 10వేలను మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273